
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 సిద్దిపేట
బుధవారం 24 సెప్టెంబరు 2025



అమృత్ భారత్‌తో రైల్వేస్టేషన్ల అభివృద్ధి

- పనుల వేగవంతానికి చర్యలు
- సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలక్రిష్ణ

7

ప్రచారం ఘనం..

ఆదరణ శూన్యం

- ఆయిల్ పామ్ రైతులను పట్టించుకోరా..
- ఐదేళ్ల క్రితం సాగు వైపు రైతులను మళ్లించిన ప్రభుత్వం, అధికారులు
- రెండేళ్ల పాటు పట్టించుకుని.. ఆ తర్వాత వెనక్కి చూడని వైనం
- ములుగు మండలంలో 257 ఎకరాల్లో సాగు
- సలహాలు, సూచనలు అందక భారంగా మారిన నిర్వహణ, మార్కెట్

8



గాయత్రీదేవి అలంకరణలో..

వర్గల్ విద్యాధరి క్షేత్రంలో అమ్మవారు మంగళవారం విద్యానరస్వతీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో విశేషపంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఉత్సవాలకు భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

- వర్గల్, సెప్టెంబరు 23

రాములు యాదిలో..

- కాతా రామచంద్రారెడ్డి మృతితో చిన్నబోయిన తీగలకుంటపల్లి

- మొదటి నుంచి అభ్యుదయ భావాలే..
- అప్పుడే శాంతితో స్టేజీ మ్యారేజ్..
- ఉపాధ్యాయుడిగా ఏపీటీఎఫ్‌లో చురుకుగా..
- రాములు.. అని ముద్దుగా పిలుచుకునేటోళ్లం..
- జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్న చిన్ననాటి మిత్రులు

అతనితో కలిసి ఆడిన ఆటలు, మాట్లాడిన ముచ్చట్లు, సిద్ధాంతాలపై జరిగిన చర్చలు ఇప్పుడు కాతా రామచంద్రారెడ్డి చిన్ననాటి మిత్రులకు గుర్తొస్తున్నాయి. "రాములు"... అని ముద్దుగా పిలిచి 36 ఏళ్లు దాటినా.. మళ్లీ రాకపోతాడా..? మళ్లీ పిలవకపోతామా.. అని ఎదురుచూసిన వారి ఆశలు అడియాసలయ్యాయి. "ఎప్పటికైనా తిరిగి వస్తాడు, మాకు తలకొరివి పెడతాడు" అని ఆశతో ఎదురుచూసిన వృద్ధాప్య తల్లిదండ్రులకు కొడుకు మరణ వార్త మరింత కుంగదీసింది. కాతా రామచంద్రారెడ్డి అలియాస్ రాజుదాదా, గుడ్సా ఉసెండీ, విజయ్, వికల్స్ చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపర్ జిల్లా అబుజ్‌మడ్ అడవుల్లో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో స్వగ్రామమైన కోహెడ మండలం తీగలకుంటపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హుస్నాబాద్/ కోహెడ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి)



కోహెడ మండలం తీగలకుంటపల్లి గ్రామ పంచాయతీ (ఇన్‌సెట్‌లో కాతా రామచంద్రారెడ్డి (ఫైల్))

భౌతికకాయాన్ని తీసుకొచ్చేందుకు వెళ్లిన కొడుకు

రామచంద్రారెడ్డి భౌతికకాయాన్ని తీసుకురావడానికి ఆయన కుమారుడు రాజాచంద్ర మరొక న్యాయవాదితో కలిసి వెళ్లారు. బుధవారం భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చే అవకాశాలున్నాయి.

పదో తరగతి వరకు కోహెడ హైస్కూల్‌లో..

తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డి, వజ్రవ్వల కుమారుడైన కాతా రామచంద్రారెడ్డి ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు కోహెడ హైస్కూల్‌లో చదువుకున్నారు. 1979లో పదో తరగతి పూర్తి కాగానే సిద్దిపేటలో ఇంటర్మీడియట్ చేశారు. ఆ తర్వాత హన్మకొండలో టీటీసీ పూర్తి చేసి, 1983లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించారు.

ఆది నుంచి అభ్యుదయ భావాలే..

రామచంద్రారెడ్డిలో మొదటి నుంచి అభ్యుదయ భావాలున్నాయని ఆయన స్నేహితులు చెబుతున్నారు. అదే భావజాలంతో సిద్దిపేటలో శాంతిప్రియ (సాహితిని) స్టేజీ మ్యారేజ్ చేసుకున్నారు. తొలుత అప్పటి కరీంనగర్ జిల్లా పెంచికల్‌పేటలో ఉపాధ్యాయుడిగా పనిచేసి, 1987లో తన స్వగ్రామం పక్కనే ఉన్న వరుకోలు గ్రామానికి బదిలీ అయ్యారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘంలో చురుగ్గా పనిచేశారు. ఇంటర్మీడియట్ నుంచే రాడికల్ విద్యార్థి సంఘాల వైపు ఆకర్షితులయ్యారు. 1989లో ఉద్యోగాన్ని వదలి పీపుల్స్ వార్ పార్టీలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అప్పటి నుంచి 36 సంవత్సరాలుగా ఇంటి వైపు చూడలేదు. పోలీసులు చాలాసార్లు ఆయన

మిగతా 8వ పేజీలో



హోంగార్డులు పోలీసుశాఖలో

అంతర్గత భాగమే

సిద్దిపేట క్రైం సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హోంగార్డులు పోలీస్‌శాఖలో అంతర్గత భాగమే అని, ప్రతీ స్టేషన్‌లో పోలీసులతో కలిసి విధులు నిర్వహిస్తారని సీపీ అనురాధ అన్నారు. మంగళవారం ఆమె సిద్దిపేట సీపీ కార్యాలయంలో జిల్లాలోని హోంగార్డులు సిబ్బందితో దర్బార్ నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. యూనిఫామ్ వేసుకున్న ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్ర బోస్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్, ఆర్ఎస్ఐ బాలకృష్ణ, హోంగార్డ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవీందర్‌రెడ్డి, హోంగార్డ్స్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సీపీ హుస్నాబాద్ డివిజన్ పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె కమిషనర్ కార్యాలయంలో హుస్నాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేసు నమోదైన నిందితులను అరెస్టు చేయాలని, నిందితుల అరెస్టు చేసే విషయంలో ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు.



ఎన్సాన్‌పల్లిలో లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి, పూజల హరికృష్ణ

రూ.8లక్షల కోట్లు ఎక్కడ ఖర్చు చేశారు

- మంత్రి వివేక్ వెంకటస్వామి

సిద్దిపేట/సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 60 వేల కోట్ల అప్పులుంటే, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ.ఎనిమిది లక్ష ల కోట్లు అప్పులు చేసిందని, ఆ డబ్బు ఎక్కడ ఖర్చు చేసిందో అర్థం కావడం లేదని రాష్ట్ర గనులు, ఉపాధి కల్పన శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. సిద్దిపేటలోని 37వ వార్డులో, సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎన్సాన్‌పల్లిలో మంగళవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీ, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్‌తో కలిసి సందర్శించారు. లబ్ధిదారులు మంత్రికి తిలకం దిద్ది ఆహ్వానించారు. ఎన్సాన్‌పల్లిలో లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద మెగా కాళేశ్వరం ప్రాజెక్టు కట్టామని కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. డిసెంబరు నాటికి సిద్దిపేట నియోజకవర్గానికి మరో 3,500 ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీఇచ్చారు. సిద్దిపేటలో సాండ్ బజార్ ఏర్పాటు చేసి ఇసుక సమస్య రాకుండా చూస్తామన్నారు.

మంత్రికి పోలీసుల వినతిపత్రం

సిద్దిపేట పోలీస్‌శాఖలో గతేడాది నుంచి రావాల్సిన ఎస్ఎల్ఎస్, అడిషనల్ ఎస్ఎల్ఎస్ బిల్లులు, ఐదు జీపీఎఫ్ బిల్లులు, 2018 పీఆర్సీ బకాయిలు, 2023 టీఏ బకాయిలను మంజూరు చేయాలని సిద్దిపేటలో మంత్రి గడ్డం వివేక్ వెంకట్‌స్వామికి పోలీసులు వినతి పత్రం సమర్పించారు. త్వరలోనే రెండు బిల్లులు వచ్చే విధంగా చూస్తానని మంత్రి తెలిపారు.

స్వచ్ఛ విద్యాలయ సర్వే

- బడులకు రేటింగ్, రూ.లక్ష బహుమతి
- ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు గడువు

కొండపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పరిశుభ్రత, పచ్చదనం, మౌలిక వసతులను ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం "స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ" పేరుతో సర్వే నిర్వహిస్తోంది. నిర్ణీత అంశాల ఆధారంగా పాఠశాలలకు రేటింగ్‌లు ఇచ్చి, అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన పాఠశాలలకు నగదు బహుమతి అందిస్తారు. ఈ సర్వేలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), మోడల్, రెసిడెన్షియల్, ప్రైవేట్ పాఠశాలలు కూడా పాల్గొనవచ్చు. మొత్తం 60 ప్రశ్నలకు 125 మార్కులతో ఈ సర్వే ఉంటుంది. వివిధ అంశాల ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. ఈ సర్వేలో సాధించిన మార్కుల ఆధారంగా పాఠశాలలకు స్టార్ రేటింగ్‌లు ఇస్తారు.35 నుంచి 50 మార్కులు వచ్చిన పాఠశాలలకు 2 స్టార్, 51నుంచి 74 వచ్చిన స్కూళ్లకు 3 స్టార్, 75 నుంచి 89 వరకు వచ్చిన పాఠశాలలకు 4 స్టార్, 90 నుంచి 100 మార్కులు వచ్చిన పాఠశాలలకు 5 స్టార్ రేటింగ్ ఇస్తారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ఎంపికైన పాఠశాలలకు వరుసగా 3, 4 స్టార్ రేటింగ్‌లు ఇస్తారు. జాతీయ స్థాయిలో 5 స్టార్ రేటింగ్ పొందిన పాఠశాలకు ఒక లక్ష రూపాయల నగదు బహుమతి లభిస్తుంది. ఈ నిధులను పాఠశాల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు.



ఉపాధ్యాయులకు అవగాహన

సిద్దిపేట జిల్లాలో మొత్తం 1237 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. ఈ సర్వేపై ఉపాధ్యాయులకు ఇప్పటికే అవగాహన కల్పించారు. ఆసక్తిగల పాఠశాలల యాజమాన్యాలు సెప్టెంబర్ 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో సమర్పించిన వివరాలను పరిశీలించడానికి ఒక కమిటీ పాఠశాలలను తనిఖీ చేస్తుంది. ప్రతి జిల్లా నుంచి గ్రామీణ ప్రాంతాల నుంచి ఆరు, పట్టణ ప్రాంతాల నుంచి రెండు పాఠశాలలను ఎంపిక చేస్తారు. ఈ ఎంపికైన పాఠశాలలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

వాస్తవ పరిస్థితులను మాత్రమే నమోదు చేయాలి

జిల్లాలోని 1237 పాఠశాలల్లో ఇప్పటివరకు 980కి పైగా పాఠశాలలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నాయి. మిగతా పాఠశాలలు కూడా త్వరగా దరఖాస్తు చేసుకోవాలి.

- రంగనాథ్,
జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి



బహుమతులు అందజేస్తున్న శివసేనారెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి

సీఎం మంచి క్రీడాకారుడు

- రెండేళ్లలో క్రీడలకు రూ.850 కోట్లు క్రీడలను నిర్లక్ష్యం చేసిన గత సర్కార్
- తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

దుబ్బాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మంచి క్రీడాకారుడని, ఆయనకు క్రీడల పట్ల ఉన్న ఉత్సాహంతో యువతను ఆటల వైపు ప్రోత్సహిస్తూ ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా పని చేస్తున్నారని తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధి లచ్చపేట మోడల్ స్కూల్‌లో పీవీఆర్ ట్రస్ట్ కన్వీనర్, టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ పణ్యాల శ్రవణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం క్రీడలను నిర్వీర్యం చేసిందని, పదేళ్లలో కేవలం రూ.350 కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. సీఎం రేవంత్ నాయకత్వంలోని కాంగ్రెస్ సర్కార్ ఈ రెండేళ్లలోనే రూ.850 కోట్లను క్రీడలకు కేటాయించిదని, నిరుపయోగంలో ఉన్న గచ్చిబౌలి స్టేడియాన్ని రూ.28 కోట్లతో పునరుద్ధరించామని తెలిపారు. రాష్ట్ర జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు క్రీడా శాఖలోనే ప్రభుత్వ ఉద్యోగం కల్పించే దిశగా రేవంత్ సర్కార్ పరిశీలిస్తుందన్నారు. నికత్ జరీన్, సిరాజ్‌లకు డీఎస్పీ ఉద్యోగాలు ఇచ్చి క్రీడాకారుల్ని గౌరవించిన ఏకైక ప్రభుత్వం తమదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ కమిషనర్ కళ్యాణ రమేష్, మాజీ ఎంపీటీసీ చందిరి సంజీవరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అందె రాజిరెడ్డి, ఇస్తారిగల్ల మల్లేష్, ఆర్గనైజర్లు బిజ్జ గిరిబాబు, చంద్రకాంత్, ప్రభు, రవీందర్, పలువురు పీడీలు, పీఈటీలు క్రీడాకారులు పాల్గొన్నారు.

హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు



హుస్నాబాద్‌లోని ఓ హోటల్‌లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

- జరిమానాలు విధించిన మున్సిపల్ అధికారులు

హుస్నాబాద్/దుబ్బాక, సెప్టెంబరు 23: పరిశుభ్రత పాటించని, కుళ్లిన ఆహార పదార్థాలను వినియోగిస్తున్న హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా హుస్నాబాద్ పట్టణంలో మొత్తం రూ. 51 వేలు, దుబ్బాకలో రూ. 2 వేల జరిమానా విధించారు.

హుస్నాబాద్‌లో ఎనిమిది హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించిన అధికారులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడడం, కుళ్లిపోయిన ఆహార పదార్థాలు నిల్వ చేయడం వంటి వాటిని గుర్తించారు. తనిఖీలు చేపట్టిన వారిలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, సతీష్, సారయ్య, ప్రభాకర్ ఉన్నారు. అలాగే, దుబ్బాక పట్టణంలో ఒక బేకరీని పురపాలక మేనేజర్ శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. నాణ్యత లేని, గడువు ముగిసిన ఆహార పదార్థాలను తయారు చేయడంతో పాటు, అపరిశుభ్ర వాతావరణాన్ని గుర్తించారు. మరోసారి ఇలాంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట శానిటరీ ఇన్‌చార్జి శ్రీకాంత్, ఇతర పురపాలక సిబ్బంది ఉన్నారు.

మున్సిపాలిటీలకు నిధులు

- టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ. 75 కోట్లు
- ఒక్కో పురపాలికకు రూ.15 కోట్లు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



దుబ్బాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా జిల్లాలోని మున్సిపాలిటీలు ఎదురుచూస్తున్న టీయూఎఫ్ఐడీసీ నిధులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సోమవారం, ఒక్కో పురపాలికకు రూ. 15 కోట్ల చొప్పున మొత్తం రూ. 75 కోట్లు విడుదల చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రభుత్వ కార్యదర్శి శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి, రాష్ట్ర బడ్జెట్‌లో మున్సిపాలిటీలకు నిధులు కేటాయించిన తర్వాత, ప్రభుత్వం కేవలం సిద్దిపేట, గజ్వేల్ పురపాలికల నుంచి మాత్రమే డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ పంపాల్సిందిగా ఆదేశించింది. జిల్లాలోని మిగతా మున్సిపాలిటీలకు నిధులు రావడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ విషయంపై ఈనెల 15న 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ఆ రెండింటికే పరిమితమా..? అనే శీర్షికతో కథనం వెలువడింది. ఈ కథనంతో ఆయా నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జులు, దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఈ సమస్యను మంత్రి వివేక్ దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం సోమవారం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు రూ. 75కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఆదాయం తక్కువగా, ఖర్చులు ఎక్కువగా ఉన్న ఈ మున్సిపాలిటీలు గత మూడేళ్లుగా నిధుల కోసం ఎదురుచూస్తుండగా, ఈ నిధుల మంజూరుతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామికి కాంగ్రెస్ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉధృతంగా..

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు



వెల్దుర్తి : మత్తడి దూకుతున్న దేవతల చెరువు

వెల్దుర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి వెల్దుర్తి మండలంలోని చెరువులు, చెక్ డ్యామ్‌లు పొంగిపొర్లుతున్నాయి. సోమవారం రాత్రి కురిసిన వానకు మండల కేంద్రంలోని దేవతల చెరువులోకి భారీగా నీరు చేరడంతో అలుగు పారుతోంది. అలాగే ఉప్పులింగాపూర్ గ్రామ శివారులోని హల్దీవాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాల వల్ల ఉప్పులింగాపూర్, యశ్వంతరావుపేట గ్రామాల్లో రెండు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, వాటిని పరిశీలించి పంచనామా నిర్వహించినట్లు ఆర్‌ఐ నర్సింగ్‌యాదవ్ తెలిపారు.ఎలుకపల్లి గ్రామంలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఒక పశువుల పాక ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ. లక్ష విలువైన ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కానికే యాదగిరి కోరారు.

● తూప్రాన్ : తూప్రాన్ మండలం, సిద్దిపేట జిల్లా వర్గల్ మండలాల్లో కురిసిన భారీ వర్షాలకు హల్దీవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. తూప్రాన్‌లో 46.3 మి.మీ, వర్గల్‌లో 52.8 మి.మీ వర్షం నమోదైంది. వాగులో వరద ప్రవాహం పెరిగి కాజ్‌వేలపై మీటరున్నర ఎత్తులో ప్రవహిస్తోంది. దీంతో తూప్రాన్-కిష్టాపూర్ గ్రామాల మధ్య, అలాగే కిష్టాపూర్, వెంకటాయపల్లి, నర్సంపల్లి, బేగంపేట, అప్పాయపల్లి, ఎల్కల్, గౌడిగూడెం, గుండ్రెడ్డిపల్లి, మల్కాపూర్, కోనాయపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

● మిరుదొడ్డి : మిరుదొడ్డి మండలం ఆరెపల్లి శివారులో భారీ వర్షానికి రోడ్డుపై ఓ పెద్ద చెట్టు విరిగిపడింది. ఎస్సై సమత సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహాయంతో చెట్టును తొలగించారు.

● చేర్యాల : చేర్యాల మండలంలోని తాడూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. గ్రామ శివారులోని లోలెవల్ కాజ్‌వేపై వరద ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

● నంగనూరు మండలం సంతోష్ నగర్‌లో 7 మూగజీవాలు, మగ్దంపూర్‌లో పాడి గేదె పిడుగు పడి మృత్యువాతపడ్డాయి.



తూప్రాన్ వద్ద హల్దీవాగు..



చేర్యాల మండలం తాడూరు గ్రామశివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

సింగూరుకు పెరుగుతున్న వరద

పుల్కల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రల్లో కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం మరింతగా పెరిగింది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 58,892 క్యూసెక్కులుగా నమోదైంది. ఏడు క్రస్ట్ గేట్ల ద్వారా 56,597 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేటు గుండా 1,635 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 120 క్యూసెక్కులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మిగిలిన 390 క్యూసెక్కులు ఆవిరి అవుతోంది. మంగళవారం నాటికి ప్రాజెక్టులో 520.515 మీటర్ల వద్ద 16.607 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే, సంగారెడ్డి సమీపంలోని మంజీర రిజర్వాయర్ నుంచి కూడా నాలుగు క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

ఐదు తులాల పుస్తెలతాడు అపహరణ : దర్యాప్తు చేస్తున్న పోలీసులు

గుమ్మడిదల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని దొంగలు ఓ మహిళ మెడలో నుంచి ఐదు తులాలు ఖరీదైన పుస్తెలతాడు అపహరించి పారిపోయిన సంఘటన మంగళవారం గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉంటున్న గుమ్మడిదల గ్రామానికి చెందిన రాధమ్మ మెడలో నుంచి 50గ్రాములు పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మంచినీళ్లు కావాలంటూ చెప్పి ఎవరూ లేరని గ్రహించి లాక్కొని వెళ్లాడు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలవడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వర్గల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన భర్తను భార్య మందలించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం మీనాజీపేట గ్రామానికి చెందిన కీసరి రాజు (30) కొంత కాలం నుంచి తాగుడుకు బానిసై భార్య మహేశ్వరీతో గొడవ పడేవాడు. ఈ నెల 9న రాత్రి రాజు మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మహేశ్వరీ ఎందుకు తాగుతున్నావని మందిలించడంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికొచ్చి నిద్రపోయాడు. తరువాత రోజు ఉదయాన్నే రాజు వాంతులు చేసుకోవడంతో ఏమి జరిగిందని ఆరా తీయగా పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. చికిత్స కోసం ములుగు లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతి

వెల్దుర్తి, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో విద్యుత్ రావడం లేదని ఇంటిపై కప్పు ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ తాపీమేస్త్రీ మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన తాపీ మేస్త్రీలు నారాయణశర్మ(37), ప్రభుకుమార్ శర్మ, వినోద్‌శర్మ, సంతోష్ శర్మ, దల్లు శర్మలు మండల కేంద్రమైన వెల్దుర్తిలోని డబుల్ బెడ్‌రూమ్‌లలో కిరాయికి ఉంటున్నారు. సోమవారం రాత్రి ఇంట్లో విద్యుత్ సరఫరా లేదని ఇంటిపై కప్పు ఎక్కి నారాయణశర్మ తోపాటు ప్రభుకుమార్‌శర్మ, వినోద్‌కుమార్‌శర్మ, సంతోష్‌శర్మ, ధల్లుశర్మ మరమ్మతులు చేస్తుండగా నారాయణశర్మకు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో తన వెనుక ఉన్న పిల్లర్‌పై పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమై స్పృహ తప్పి పడిపోయాడు. చికిత్స నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే నారాయణశర్మ మృతి చెందినట్లు తెలిపారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి ..

పటాన్‌చెరు సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సింగిపేట గ్రామం తాండూరు మండలం వికారాబాద్ జిల్లాకు చెందిన పండరప్ప (52) నర్శింలు, నరేష్, వెంకటయ్యలతో కలిసి మంగళవారం తెల్లవారుజామున పటాన్‌చెరుకు వచ్చారు. టీ తాగడానికి పండరప్ప రోడ్డు దాటుతుండగా లింగంపల్లి నుంచి సంగారెడ్డి వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం

పటాన్‌చెరు సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం అయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు.. ఇంద్రేశం పట్టణంలో నివాసం ఉంటున్న శరణప్ప ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 19న ఉదయం బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి భార్య దుర్గమ్మ, కుమారులు దేవరాజ్, నాగరాజు, కుమార్తె రమాదేవిలు కనిపించలేదు. చుట్టుపక్కల వారిని, బంధువులను అడిగినా ఫలితం లేకపోవడంతో మంగళవారం శరణప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా



జాతీయ రహదారిపై బోల్తాపడిన లోడు లారీ

కంది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని 65 జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున ఓ ఇనుప పట్టీల లోడు లారీ బోల్తాపడింది. లారీ క్యాబిన్ నుంచి ఇనుప పట్టీలు బయటకు చొచ్చుకుపోవడంతో డ్రైవర్, క్లీనర్‌లకు గాయాలయ్యాయి. విద్యుత్ టవర్ నిర్మించే ఇనుప పట్టీల సామగ్రి లోడ్ వేసుకుని మహారాష్ట్ర వైపు వెళ్తుంది. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కంది శివారులో ఓ ట్రక్కును పక్క నుంచి రాడండంతో లారీని సైడ్ తీసుకున్నాడు. అక్కడ తవ్విన గుంతలో లారీ అదుపుతప్పి బోల్తా పడింది. వెంటనే టవర్ పట్టీలు లారీ క్యాబిన్ నుంచి బయటికి చొచ్చుకువచ్చాయి. దీంతో డ్రైవర్ రాజ్‌కుమార్‌కు కాలుకు, క్లీనర్ వినాయక్ తలకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకని దర్యాప్తు చేస్తున్నట్లు సంగారెడ్డి రూరల్ ఎస్సైరవీందర్ తెలిపారు.

చెవి కమ్మల చోరీకి యత్నం

సిద్దిపేట రూరల్,సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి చెవి కమ్మలు చోరీకి యత్నింతించిన దొంగను గ్రామస్థులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు పట్టించారు. ఈ సంఘటన నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వృద్ధురాలు దాసరి ఎల్లవ్వ తన పొలం వద్దకు వెళ్తుండగా కరీంనగర్‌కు చెందిన అనిల్ ఆమెపై దాడి చేసి చెవి కమ్మలు లాక్కుంటుండగా చుట్టు పక్కల వారు గమనించి దొంగను పట్టుకుని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం చిన్నకోడూరు ఎస్సై సైఫ్ అలీకి పట్టించారు.

సెల్‌ఫోన్ దొంగిలించి.. డబ్బులు కాజేసి..

పటాన్‌చెరు సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బస్సు ఎక్కుతున్న ఓ వ్యక్తి ఫోన్ దొంగిలించి ఫోన్ నంబరు ఆధారంగా బ్యాంకు ఖాతాలో డబ్బులు వేరే ఖాతాలోకి మళ్లించిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నేరాల పరిశోధన విభాగం సీఐ రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇస్నాపూర్ పురపాలక పట్టణ పరిధి అఖిలఫామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న వీర్‌సెట్టి గత నెల 31న ఇస్నాపూర్ కూడలిలో బీదర్ వెళ్లే బస్సు ఎక్కారు. సీట్లో కూర్చున్న తరువాత చూసుకుంటే ఫోన్ కనిపించలేదు. వేరే ఫోన్‌తో తన నంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ దొంగిలించారు. ఈ నెల 7న డబ్బులు తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్తే ఖాతాలోంచి రూ.3లక్షల60వేల 800లు వేరే ఖాతాలోకి ఫోన్ నంబరు ఆధారంగా మళ్లించారు.

క్షయ నివారణ పై చాంపియన్స్‌కు శిక్షణ

కొండపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ప్రతినిధులు భైటి రజనీకాంత్, రాజు,కొండపాక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీధర్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధన్ రాజ్ ,జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అరుణ్ కుమార్ ఆదేశంతో ఇంపాక్ట్ ప్రాజెక్ట్ ద్వారా టీబీ అవగాహన సదస్సును మంగళవారం కొండపాకలో నిర్వహించారు. కొండపాక, కుకునూరు పల్లి , తొగుట పీహెచ్‌సీ ల పరిధిలోని 16 సబ్ సెంటర్లకు చెందిన 25 మంది టీబీ చాంపియన్స్‌కు శిక్షణ ఇచ్చారు. గతంలో టీబీ వ్యాధికి గురై మందులు వాడి వ్యాధినుంచి కోలుకొని నయమైన వారిని టీబీ చాంపియన్స్‌గా పిలవబడతారని పేర్కొన్నారు. ఈ చాంపియన్స్‌కి టీబీ వ్యాధి పట్ల పూర్తి అవగాహన కల్పించి వ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణకు తీసుకోవాల్సిన పరీక్షలు చికిత్సలపై అవగాహన కల్పించారు.

సమగ్ర దర్యాప్తు జరపాలి : సంగారెడ్డి ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తు చేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పోలీసు అధికారులకు సూచించారు. జిల్లాలో పోలీసుల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ, దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచేందుకు సాంకేతికత వినియోగంలో సంగారెడ్డి జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల ఛేధనకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డయల్ 100కు సత్వరమే స్పందించి బాధితులకు అండగా నిలువాలన్నారు. ఎస్‌హెచ్‌వోలు ప్రతి గ్రామాన్ని సందర్శించి, అయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలను తెలుసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ అన్ని కుల మతాలకు చెందిన పవిత్ర స్థలాల్లో, పరిశ్రమల్లో ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనే విధంగా చూడాలని ఎస్పీ పంకజ్ సూచించారు. వీధి రోడ్లకు ఉన్న కెమెరాలను నేను సైతం కెమెరాలుగా జియో ట్యాగ్ చేయించే విధంగా వివిధ సంఘాల పెద్దలకు అవగాహన కల్పించాలన్నారు.



బాలాత్రిపుర సుందరిగా..

కొండపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మర్పడగ విజయదురామాత బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ వర్ణాల గాజులతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



400 కిలోలతో కుంకుమార్చన

గజ్వేల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని మహంకాళీ దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు అమ్మవారు త్రిమూర్తి అలంకారంలో దర్శనమిచ్చారు. 400 కిలోల కుంకుమతో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు.



గాయత్రీ దేవిగా..

గుమ్మడిదల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి వీరన్నగూడెం వీరభద్ర స్వామి దేవస్థానంలోని భద్రకాళి అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల పెద్దఎత్తున తరలివచ్చారు.

వైభవంగా కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

గుమ్మడిదల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదలలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. బ్రహ్మోత్సవాల తొలి రోజున శాస్త్రోక్త పద్ధతిలో చెరువు మట్టిని స్వామివారికి సమర్పించారు. గ్రామ శివారులోని చెరువు నుంచి పవిత్రమైన మట్టిని తీసుకొచ్చి వేద పండితుల సమక్షంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి పూజలు చేశారు.బ్రహ్మోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ మద్దుల బాల్ రెడ్డి తెలిపారు. ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని, ఇందులో రథోత్సవం, గరుడసేవ, హనుమంత వాహన సేవ, కల్యాణ మహోత్సవం వంటివి ఉంటాయని వివరించారు. ఈ ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. బ్రహ్మోత్సవాల విజయవంతం కోసం గ్రామ యువత, ప్రజలు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న భక్తులు



కోర్టు ఉత్తర్వులను చూపుతున్న భూబాధితులు

జాతీయ రహదారి విస్తరణ పనులను అడ్డుకున్న భూబాధితులు

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ తమ స్థలాల్లో రోడ్డును వేస్తున్నారంటూ పలువురు భూ బాధితులు మంగళవారం జాతీయరహదారి విస్తరణ పనులను అడ్డుకున్నారు. సంగారెడ్డి చౌరస్తాలోని పోతిరెడ్డిపల్లి నుంచి కంది శివారులోని ఐఐటీహెచ్ వరకు దక్షిణ భాగం వైపు తమకు సంబంధించి స్థిరాస్తులను కూల్చివేస్తూ విస్తరణ చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ నుంచి రెండు వైపులా వంద ఫీట్ల చొప్పున రోడ్డును విస్తరించాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా నేషనల్ హైవే అథారిటీ డిప్యూటీ ఈఈ రామకృష్ణ దక్షిణ వైపు అదనంగా 15 ఫీట్ల మేర పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఉత్తరం 85 ఫీట్లు, దక్షిణం 115 ఫీట్లు రోడ్డును విస్తరించడం సరికాదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు సంబంధించిన పలువురు వ్యక్తులు బాధితులతో గొడవకు దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. కోర్టు ఉత్తర్వుల ప్రకారమే పనులు చేయాలని బాధితులు మొండికేయడంతో కాంట్రాక్టర్ మనుషులు వెళ్లిపోవడంతో గొడవ సద్దుమణిగింది.

అమృత్ భారత్‌తో రైల్వేస్టేషన్ల అభివృద్ధి

- పనుల వేగవంతానికి చర్యలు
- సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలక్రిష్ణ
- జహీరాబాద్ స్టేషన్ పరిశీలన

జహీరాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్‌లో భాగంగా సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని పలు రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులు చురుకుగా కొనసాగుతున్నాయని, వాటిని మరింత వేగవంతంచేసేలా చర్యలు చేపడుతున్నామని సికింద్రాబాద్ డివిజనల్ రైల్వేమేనేజర్ గోపాలక్రిష్ణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కర్ణాటక, మహారాష్ట్రల్లోని పర్లీ, జాల్నా, బాల్కి, బీదర్, జహీరాబాద్ ప్రాంతాల్లోని రైల్వేస్టేషన్లను సందర్శించారు. కొనసాగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు రైల్వే ద్వారా రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. అమృత్ భారత్‌లో భాగంగా సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో 36 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కల్బుర్గీ నుంచి బీదర్‌వరకు నడిచే రైలును జహీరాబాద్ వరకు పొడిగించాలని, పూర్ణ-తిరుపతి రైలును జహీరాబాద్‌లో నిలిపేలా చూడాలని, బీదర్-హైదరాబాద్ ఇంటర్‌సిటీ రైళ్ల సంఖ్యను పెంచాలని స్థానిక నాయకులు ఆయన విన్నవించారు. అలాగే ముంబయికి వెళ్లే రైళ్లు వికారాబాద్, జహీరాబాద్ మీదుగా కొనసాగించాలని, ఖాజీపేట-సికింద్రాబాద్ రైలును నాంపల్లి రైల్వేస్టేషన్‌లో నిలిపేలా చూడాలని కోరారు. జహీరాబాద్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి త్వరలో వినియోగంలోకి తీసుకువచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గుప్త, జాగో తెలంగాణ రాష్ట్ర నాయకులు రాములు నేత, రైల్వే స్టేషన్ మేనేజర్ మాదవక్రిష్ణ తదితరులు డీఆర్‌ఎంను శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు న్నారు.



జహీరాబాద్ రైల్వేస్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం గోపాలక్రిష్ణ

ఉత్సవాలకు రండి.. మంత్రులకు ఆహ్వానం





మంత్రులు కొండ సురేఖ, జూపల్లి కృష్ణరావుకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఆలయ సభ్యులు, నాయకులు

వర్గల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో కొనసాగుతున్న విద్యాసరస్వతీ అమ్మవారి శరన్నవరాత్రోత్సవాలకు హాజరు కావాలని మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణరావును ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో వారిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. వర్గల్ విద్యాధరి క్షేత్రాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేయాలని కోరగా, మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు నూక భిక్షపతి గుప్త, ఏఎంసీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాక

వర్గల్ విద్యాధరి క్షేత్రానికి బుధవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట కవిత రానున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న పూజా కార్యక్రమాల్లో ఆమె పాల్గొంటారని తెలిపారు.

అవినీతికి అడ్డాగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కన్స్యూమర్ సొసైటీ

- నాసిరకం వస్తువులు, బియ్యం, పప్పుల్లో పురుగులు
- ఆగ్రహించిన ఉద్యోగ సంఘాలు.. దిష్టిబొమ్మ దహనం

కంది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని కన్స్యూమర్ సొసైటీ అవినీతికి అడ్డాగా మారిందని ఉద్యోగ సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆ సొసైటీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అవినీతి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ ఏవీఈఈఎఫ్ పాలక వర్గం ఏర్పడిన తర్వాత గత సంవత్సరం నుంచి ఒక్క నెల కూడా బ్యాలెన్స్ షీట్ అప్రూవల్ చేసుకోలేదన్నారు. కన్స్యూమర్ సొసైటీలో నాసిరకం వస్తువులు అధిక ధరలకు అమ్ముతున్నారని, దీంతో అమ్మకాల శాతం తగ్గిపోయిందని వాపోయారు. ఇటీవల ఈ సొసైటీలో ఉద్యోగులకు అందిచాల్సిన 50 కిలోల వేరుసెనగల బస్తా మాయమైపోయిందని విమర్శించారు. ఉప్మారవ్వ, బాదాం, జీడిపప్పుల్లో పురుగులు, బియ్యం రేటులో తేడా ఉందని మండిపడ్డారు. నాసిరకం వస్తువులు ఒక లారీ లోడు నిండా ప్యాకింగ్ కట్టలు అమ్ముకొని దానికి లెక్కలు వేయకుండా మాయం చేశారన్నారు. కన్స్యూమర్ సొసైటీలో పెట్రోల్ బంకులో జరిగిన అవకతవకలు రూ.70 వేలతో ప్రారంభమై ఇప్పుడు సొసైటీ మొత్తాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీని పారదర్శకంగా నడిపించాలని, ఏటా జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఓఎఫ్‌ఎంఎస్, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ, ఓఎఫ్ఆర్‌ఈయూ యూనియన్లు, అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యూనియన్లు, అసోసియేషన్లు, కన్స్యూమర్ సొసైటీ సభ్యులు

పారదర్శకత విజయ డెయిరీ ప్రత్యేకత

- నాణ్యమైన పాల సరఫరా చేయడమే లక్ష్యం
- టీజీడీడీసీఎఫ్ జీఎం మధుసూదన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న టీజీడీడీసీఎఫ్ జీఎం మధుసూదన్‌రావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పారదర్శకతే విజయ డెయిరీ ప్రత్యేకత అని తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విజయ డెయిరీలో డీడీ రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాల ఉత్పత్తిదారులకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛమైన పాల సేకరణ, సరఫరాపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. విజయ డెయిరీపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటమన్నారు. జిల్లాలో పలు రద్దీ ప్రాంతాల్లో విక్రయ కేంద్రాలను గుర్తిస్తామని, ఇందుకోసం ప్రత్యేక బృందాలతో సర్వే నిర్వహిస్తామన్నారు. వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు వివరించారు. సమావేశంలో సీక్యూసీ కవిత, పీవో ప్రసన్న, అకౌంట్స్ కళ్యాణి, విజయ్, డీడీ రమేష్, మెదక్, నారాయణఖేడ్, జహీరాబాద్ మేనేజర్లు, ఫీల్డ్ సూపర్‌వైజర్లు తదివతరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

- వ్యవసాయ శాఖ జేడీ శివప్రసాద్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో ఎరువుల కొరత లేదని, కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(జేడీ) శివప్రసాద్ హెచ్చరించారు. సంగారెడ్డి మండలం నాగాపూర్ గ్రామంలోని పీఏసీఎస్ కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు అవసరం మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. ఎరువులను మోతాదులో వాడితేనే దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం కేంద్రంలో ఎరువుల స్టాక్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏవో ఝాన్సిలక్ష్మీ బాయి, సిబ్బంది ఉన్నారు.



నాగాపూర్ పీఏసీఎస్ కేంద్రంలో ఎరువుల నిల్వను పరిశీలిస్తున్న జేడీ శివప్రసాద్

దేవర స్వాతికి కీర్తిచక్ర పురస్కారం



పురస్కారం అందుకుంటున్న స్వాతి

కొండపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యువ కవి, సాహితీరత్న అవార్డు గ్రహీత దేవర స్వాతికి కీర్తిచక్ర పురస్కారం లభించింది. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన స్వాతి, ఉన్నత విద్యను అభ్యసిస్తూనే కవిగా రచనలు చేస్తూ అనేక పురస్కారాలు అందుకుంటున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, సాహితీ సంస్థల అధ్యక్షులు డాక్టర్ దూడపాక శ్రీధర్, డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్‌ల చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కీర్తిచక్ర పురస్కారంతో పాటు స్వర్ణ కంకణం, గోల్డ్ మెడల్ కూడా ఆమెకు లభించాయి. ఈ సందర్భంగా ఆమె రచించిన భారతమాతకు అభివందనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థి దశలోనే ఈ అవార్డులు అందుకోవడంపై సిద్దిపేట కవులు, కళాకారులు, ఆమె కుటుంబ సభ్యులు అభినందించారు.



సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు

దసరా సెలవులు.. కారాదు విషాదం

- నిండుకుండల్లా ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు..
- పిల్లలు అటువైపు వెళ్లకుండా చూడాలంటున్న అధికారులు

కల్హేర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలు పూర్తిగా నిండిపోయాయి. దసరా సెలవుల సందర్భంగా విద్యార్థులు, యువకులు ఈతకు వెళ్లే అవకాశం ఉన్నందున, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు, ఉద్యోగులు సెలవుల కోసం గ్రామాలకు చేరుకుంటున్నారు. ఇలాంటి సమయంలో సరదా కోసం చెరువుల్లోకి దిగితే ఈత రాక ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది. గతంలో కల్హేర్‌లో ఇలాంటి ఘటనలు జరిగాయని, రాపర్తి ఊర చెరువులో ఇద్దరు విద్యార్థులు, రెండు సంవత్సరాల క్రితం నిజాంసాగర్ ప్రాజెక్టులో ఇద్దరు యువకులు మునిగి మరణించారని ఎస్సై మధుసూదనరెడ్డి గుర్తు చేశారు. వేసవిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిగిన గుంతల్లో నీరు నిండటం వల్ల ప్రమాద అవకాశాలు మరింత ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. సెలవుల సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలని సూచించారు. చెరువులు, కుంటల వద్దకు వెళ్లనీవకపోవడమే ఉత్తమమన్నారు. పిల్లలకు సెల్ ఫోన్లు కూడా ఇవ్వదని, తద్వారా సైబర్ నేరాల బారిన పడకుండా కాపాడాలని ఎస్సై సూచించారు.

బతుకమ్మ పూలకు నారాయణఖేడ్ ప్రసిద్ధి

నారాయణఖేడ్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ పండుగ మొదలైంది. బతుకమ్మ తయారీకి గునక, తంగేడు, పట్టికుచ్చులు వంటి పూలు అవసరం. బతుకమ్మ పూలకు నారాయణఖేడ్ ప్రాంతం ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ నీటి వనరులు తక్కువగా ఉండటం, బీడు భూములు అధికంగా ఉండటం వల్ల ఈ పూలు విరివిగా లభిస్తాయి. ఏటా పండుగ సమయంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ట్రాక్టర్లు, ఆటోలు, బైకులపై వచ్చి ఈ పూలను సేకరించి తీసుకెళ్తుంటారు. గత రెండు రోజులుగా ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు కామారెడ్డి జిల్లా నుంచి కూడా వందలాది వాహనాల్లో ఈ పూలను తరలిస్తున్నారు. ఈ సంవత్సరం ఎడతెరిపి లేని వర్షాల వల్ల తంగేడు, గునక పూలు అనుకున్నంతగా పూయలేదు. పూసిన కొద్దిపాటి పూలను సేకరించడానికి భారీగా ప్రజలు తరలివస్తున్నారు.



సంగారెడ్డి సీఆర్‌పీకి జాతీయ స్థాయి అవార్డు



మరెల్లి దత్తు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ)గా పనిచేస్తున్న మరెల్లి దత్తు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అందజేసే నేషనల్ టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు అందుకోనున్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో భాగంగా పేద విద్యార్థులకు అందిస్తున్న సహాయ సహకారాలను గుర్తించిన సొసైటీ ఉత్తమ సీఆర్‌పీగా ఎంపిక చేసిందని దత్తు తెలిపారు.

'గీతం' విద్యార్థిని రమాదేవికి డాక్టరేట్



డి.రమాదేవి

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌కు చెందిన ఈఈసీఈ విభాగం పరిశోధక విద్యార్థిని డి.రమాదేవి డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'ఫ్రేమ్‌వర్క్ కోసం తగ్గింపు, నిర్మాణాత్మక నమూనా కోసం ఆప్టిమైజ్డ్ టెక్నిక్‌ల అమలు'పై ఆమె సమర్పించిన సిద్ధాంత వ్యాసానికి ఈ పట్టా లభించింది. ఈ పరిశోధనకు గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఈఈసీఈ ప్రొఫెసర్ పి. త్రినాథరావు మార్గదర్శకత్వం వహించారు. డాక్టర్ రమాదేవి పరిశోధన వీజీ, అంతకు మించి కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లకు అవసరమైన మెరుగైన బిట్ ఎర్రర్ రేట్, తగ్గిన అవుట్ ఆఫ్ బ్యాండ్ రేడియేషన్‌పై దృష్టి పెట్టింది. ఆమెకు డాక్టరేట్ లభించడంపై గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి, డైరెక్టర్లు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

దార్శనికుడు సాహితి రాము

- ప్రతీ బుధవారం పెద్దాస్పత్రిలో అన్నదానం
- పేదల 'క్షుద్బాధ'ను తీరుస్తూ

అందరి మన్ననలు పొందుతున్న రాము

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'నరుడి ముఖం ద్వారా తినేది నారాయణుడే'. 'అన్నం పరబ్రహ్మ స్వరూపం'. అన్నదానం-మహాదానం అన్న వేద, పురాణేతిహాసల్లోని సారాన్ని ఆకలింపు చేసుకుని కొందరు సమాజంలో నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి రకరకాల దానాలు చేస్తుంటారు. అన్నదానం అనేది ఒక దార్శనికమైన చర్యగా భవించబడుతుంది. అలాంటి దానాలు చేసే వారిలో సంగారెడ్డి పట్టణానికి చెందిన సాహితి రాము ముందు వరుసలో ఉన్నాడని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. రాము తన సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవకు వెచ్చిస్తున్నారు. మానవసేవ-మాధవ సేవ అన్న నానుడిని నిజం చేస్తూ ఎంత ఖర్చుకైనా వెనకాడకుండా ప్రతీ బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేస్తున్నారు. అయ్యప్ప స్వామి భక్తుడైన రాము ప్రత్యేకంగా అయ్యప్ప స్వామి జన్మనక్షత్రమైన రోజున కూడా పెద్దాస్పత్రిలో సుమారు 500 మందికి అన్నదానం నిర్వహిస్తూ తన మంచి మనసును చాటుకుంటున్నారు. గత మూడేళ్లుగా సర్కారు దవాఖానాకు వచ్చే పేదల ఆకలిని తీరుస్తున్న రాముకు మోక్షం లభించాలని, నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని రోగులు, సహాయకులు నిండుమనస్సుతో ఆశీర్వదిస్తున్నారు. రాము సేవను సంగారెడ్డి పట్టణ, జిల్లా ప్రజలు కొనియాడుతున్నారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులు, సహాయకులకు అన్నదానం చేస్తున్న సాహితి రాము

భగవంతుడు ఇచ్చిన దాంట్లోనే..



ప్రతిఫలం, లాభాపేక్ష లేకుండా, నిస్వార్థంగా పేదలకు సేవ చేయాలన్నదే నా తపన. భగవంతుడు నాకు ఇచ్చిన శక్తిలో కొంత శక్తిని అన్నదానానికి కేటాయిస్తున్నాను. నా గొప్పదనం ఏమీ లేదు. పది మందికి సేవ చేస్తేనే జీవితానికి పరమార్థం ఉంటుందనే నానుడిని గట్టిగా నమ్ముతాను. ఇది అయ్యప్ప స్వామి దయతో చేస్తున్నాను.

\- సాహితి రాము, సంగారెడ్డి

అత్యుత్తమ వంటగది సందర్శన

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వంటగది రూపకల్పన, ఆవిష్కరణలపై అవగాహన కోసం గీతం విశ్వవిద్యాలయం ఇంటీరియర్ డిజైన్ విద్యార్థులు బీఎస్‌హెచ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించారు. ఈ పర్యటనలో సిమెన్స్, గగ్గెనౌ, బాష్ వంటి అంతర్జాతీయ బ్రాండ్ల అత్యాధునిక ఉపకరణాలను విద్యార్థులు ప్రత్యక్షంగా చూశారు. స్మార్ట్ ఆటోమేషన్, ఖచ్చితమైన పనితీరును ప్రదర్శించే పరికరాలను పరిశీలించడంతో పాటు, వంట సెషన్లలో కూడా పాల్గొన్నారు. నిపుణులైన కన్సల్టెంట్ల మార్గదర్శకత్వంలో, విద్యార్థులు ఆధునిక వంటగది ప్రణాళిక, మెటీరియల్స్, సాంకేతికత పాత్ర గురించి తెలుసుకున్నారు. ఈ సందర్శన వారి విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన అనుభవం అని గీతం అధికారులు తెలిపారు.



అత్యుత్తమ వంటగదిని సందర్శించిన గీతం విద్యార్థులు

ప్రచారం ఘనం.. ఆదరణ శూన్యం

- ఆయిల్ పామ్ రైతులను పట్టించుకోని అధికారులు
- ఐదేళ్ల క్రితం సాగు వైపు రైతులను మళ్లించిన ప్రభుత్వం, అధికారులు
- రెండేళ్ల పాటు పట్టించుకొని.. ఆ తర్వాత వెనక్కి చూడని వైనం
- ములుగు మండలంలో 257 ఎకరాల్లో సాగు
- సలహాలు, సూచనలు అందక భారంగా మారిన నిర్వహణ, మార్కెట్




తునికి బొల్లారంలో ఆయిల్ పామ్ తోట, కోతకు సిద్దంగా ఉన్న ఆయిల్ పామ్ గెల

ములుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికీ ఆచరణలో అమలు కావడంలేదు. పంట సాగు చేయించేందుకు చూపిస్తున్న ఉత్సాహం, సాగు చేసిన రైతుల పట్ల చూపించడం లేదు. రైతులను సాగువైపు మళ్లించి చేతులు దులుపుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టించుకోని అధికారులు

సిద్దిపేట జిల్లా ములుగు మండలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆయిల్ పామ్ తోటల సాగు చేపట్టాలని నిర్ణయించి, అందుకు రైతులను ప్రోత్సహించారు. ములుగు మండలంలో గత ఐదేళ్లలో సుమారు 257 ఎకరాల్లో 50 మందికిపైగా రైతులు సాగు చేపట్టారు. సాగు సమయంలో పూర్తి ప్రోత్సాహం ఉంటుందని, ఇబ్బందులు లేకుండా చూస్తామంటూ రైతులకు ఆశలు కల్పించి వారిని సాగు వైపు మళ్లించారు. ఆయిల్ పామ్ తోటల సాగు చేపట్టిన రైతులను మొదటి రెండేళ్ల వరకు ఉద్యానశాఖ అధికారులు పట్టించుకున్నారు. ఆ తరువాత ఉద్యానశాఖ అధికారులు ఆ రైతుల వైపు కన్నెత్తి చూడటంలేదు. కొత్త రైతులను ప్రోత్సహిస్తూ, అంతకుముందు నుంచి సాగు చేస్తున్న రైతులను పట్టించుకోవడంలేదని ఆరోపణలు ఉన్నాయి. రైతులు సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలకు సూచనలు కూడా అందజేయకపోవడంతో అయిల్ పామ్ సాగు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తున్న రైతులపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మండలంలో ముందుగా సాగు చేసిన అయిల్ పామ్ తోటల్లో గెలలు వేసి కోతలు కూడా జరుగుతున్నాయి. తామే తోటలను నిర్వహిస్తూ, కోతలు, మార్కెట్‌ను సొంతంగా చూసుకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

మొదట్లో ప్రోత్సహించినా..



నాలుగేళ్ల క్రితం 10 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాను. గత ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తామని చెప్పడంతో సాగు చేశాను. సాగు చేసేందుకు అధికారులు ఎంతో ప్రోత్సహించారు. ఇప్పుడు కనీసం పట్టించుకోవడంలేదు. అధికారులకు ఫోన్లు చేసినా మావైపు కన్నెత్తి కూడా చూడలేదు. రైతులను ప్రోత్సహించి తోటలు సాగు చేయించినట్లుగానే, సాగు చేపట్టిన రైతులకు సహకారం అందజేయాలి. పంటలను పరిశీలన చేస్తూ సూచనలు, సలహాలు అందించాలి.

- దేవేందర్‌రెడ్డి, తునికి బొల్లారం రైతు

అధికారులను నమ్మి మోసపోయా..



ఆయిల్ పామ్ తోటల సాగుపై అధికారులు, ప్రభుత్వం చేసిన ప్రచారాన్ని నమ్మి సాగు చేసి మోసపోయాను. తోటల సాగుకు ఎంతో ప్రోత్సహిస్తున్నట్లుగా ప్రచారం చేశారు. మూడేళ్ల క్రితం ఆయిల్ పామ్ తోటలు సాగు చేశాం. సాగు చేసినప్పుడు కనిపించిన అధికారులు నేటికీ ఒక్కసారి కూడా తోట వైపు రాలేదు. ఐదెకరాలు సాగు చేసి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. అధికారులు ఇలా వ్యవహరిస్తే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఇప్పటికైనా సాగు చేసిన తోటలను పరిశీలన చేసి తగిన సూచనలు అందజేయాలి.

- సామల నర్సింహారెడ్డి, నాగిరెడ్డిపల్లి రైతు

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గజ్వేల్,సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 132/33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఈ నెల 24న విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని గజ్వేల్ విద్యుత్ శాఖ ఏడీ జగదీశ్ ఆర్యఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి, బంగ్లావెంకటాపూర్, వర్గల్ మండలం మజీద్‌పల్లి, నెంటూర్, రాయపోల్ మండలం బేగంపట సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

అకాడమిక్ కౌన్సిలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అధ్యయన కేంద్రాల్లో కాంట్రాక్టు కం కౌన్సెలింగ్ తరగతులు బోధించుటకు కౌన్సిలర్స్ నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సిద్దిపేట రీజినల్ స్టడీ సెంటర్ కోర్డినేటర్ డా. ఎం. శ్రద్ధానందం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో 55 శాతం మార్కులు కలిగివుండాలని అన్నారు. బోధన అనుభవం, పీహెచ్‌డీ, నెట్, సెట్ పీజీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హులైనవారు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో అక్టోబర్ 10 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం విశ్వవిద్యాలయ పోర్టల్‌ను, స్థానిక కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

మిరుదొడ్డి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12 నుంచి 14వరకు జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ పోటీల్లో మెదక్ జిల్లా బాలికల జట్టు ప్రథమస్థానం నిలిచిందని బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య తెలిపారు. మంగళవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడారు. జిల్లా జట్టులో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన శ్రావణి, శరణ్యలు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైనట్టు తెలిపారు. అలాగే బాలుర జట్టుకు కృష్ణసాయి ఎంపికయ్యారనితెలిపారు. ఈ నెల 25 నుండి 30వరకు జరిగే జాతీయ 44వ సబ్‌జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర జట్టుతరుపున ఆడనున్నట్టు తెలిపారు.

శంభులింగేశ్వర స్వామి ఆలయ భూములు పరిరక్షించాలి

వర్గల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ గ్రామ సమీపంలోని స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి సర్వేనెంబరు 1044లో 56 ఎకరాల భూములు గతంలో ఉండేవని ఆలయ అర్చకుడు జగం వీరభద్రయ్య తెలిపారు. అందులో 16.20 ఎకరాల భూమిని స్థానిక నాయకులు, గ్రామస్థుల తీర్మానం మేరకు గతంలో శ్రీ విద్యా సరస్వతీ అమ్మవారి ఆలయానికి కేటాయించారని, మిగతా ఖాళీగా ఉన్న భూములు ఆక్రమణకు గురౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శంభులింగేశ్వర స్వామి ఆలయం భూములను రక్షించాలని కోరుతూ ఆలయ అర్చకులు జగం వీరభద్రయ్య ఆధ్వర్యంలో మంగళవారం వర్గల్ తహసీల్దార్ రఘువీరారెడ్డికి గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని శంభులింగేశ్వర స్వామి ఆలయ భూములు చాల వరకు అక్రమణకు గురయ్యాయన్నారు. ఆలయ భూములు అక్రమణకు గురికాకుండా రక్షించాలని గ్రామస్థులు కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ లో 50 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 50 మంది వాహనదారులు పట్టుబడ్డారు. నిందితులను మంగళవారం సిద్దిపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.తరణి ఎదుట కోర్టులో హాజరుపరచగా విచారణ అనంతరం రూ.38,200జరిమానా విధించారు.

పంటల సాగు వివరాల నమోదు తప్పనిసరి: డీఏవో

గజ్వేల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సాగు వివరాలను నమోదు చేసుకోవాలని సిద్దిపేట జిల్లా వ్యవసాయాధికారి స్వరూపారాణి కోరారు. గజ్వేల్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మొక్కజొన్న, పత్తి, వరి పంటల ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఈ సీజన్‌లో పత్తి, మొక్కజొన్న, వరి పంటను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు రైతులు తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. కౌలు రైతులు, నాన్ డిజిటల్ సైన్డ్ రైతులు కూడా తప్పనిసరిగా పంట బుకింగ్ చేసుకోవాలన్నారు. వెంట వ్యవసాయ శాఖ ఏడీ బాబునాయక్, ఏవో గుండు నాగరాజు, ఏఈవోలు తదితరులున్నారు. కాగా గజ్వేల్ రైతువేదికలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో డీఏవో స్వరూపారాణి మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగును రైతులు ఎక్కువ మొత్తంలో చేపట్టాలని సూచించారు. ఆయిల్‌పామ్ సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- **జగదేవ్‌పూర్/మద్దూరు:** ఈ వానాకాలంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను వెంటనే సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని జగదేవ్‌పూర్ ఏవో వసంతరావు, మద్దూరు ఏవో బి. రామకృష్ణ తెలిపారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండలంలోని తీగుల్ గ్రామంలో జరుగుతున్న పంటల నమోదు కార్యక్రమాన్ని ఏవో వసంతరావు పర్యవేక్షించారు. అదేవిధంగా మద్దూరు మండల కేంద్రంలోని ఓ రైతు సాగు చేసిన పత్తి పంటను ఏవో బి. రామకృష్ణ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీలోగా పత్తి, 30వ తేదీలోగా మిగిలిన అన్ని పంటలను రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

రాములపల్లి హనుమాన్ ఆలయంలో చోరీ



దుండగులు ధ్వంసం చేసిన హుండీ

హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాములపల్లి గ్రామం హనుమాన్ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు హుండీని ధ్వంసం చేశారు. అందులో ఉన్న రూ. 4వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ప్రతీ మంగళవారం ఆలయానికి వచ్చి పూజలు చేసే భక్తులు ఉదయం ఆలయానికి పూజ కోసం వెళ్లగా ఆలయంలోని హుండీ తాళం పగులగొట్టి చిందరవందరగా కనిపించింది. ఆలయంలో సుమారుగా రూ. 4 వేల నోట్లను తీసుకు వెళ్లి హుండీలో చిల్లర నగదును వదిలేశారని తెలిపారు. చోరీకి పాల్పడిన దుండగులను పోలీసులు పట్టుకుని కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వివాహిత ఆత్మహత్య

సిద్దిపేట క్రైం సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల వివరాల ప్రకారం.. కడపకు చెందిన సతీష్‌కు అదే ప్రాంతానికి చెందిన అనురాధ(26)తో గత ఏప్రిల్ నెలలో వివాహం జరిగింది. భార్యభర్తలు ఉపాధి నిమిత్తం సిద్దిపేటకు వచ్చి స్థానిక రేణుక నగర్లో నివాసం ఉంటున్నారు. సతీష్ మెగా కంపెనీలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. పండగకు ఊరికి వెళ్లే విషయంలో భార్యభర్తల మధ్య మంగళవారం ఉదయం గొడవ జరిగింది. తీవ్ర మనస్థాపంతో భర్త డ్యూటీకి వెళ్లగానే అనురాధ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

మృతుల కుటుంబాలకు అండగా...



ఆర్థికసాయాన్ని అందచేస్తున్న శ్రీనివాస్ గౌడ్

కొండపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కొండపాక గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన రెండు కుటుంబాలను బిజెపి నాయకుడు మంచాల శ్రీనివాస్ గౌడ్ మంగళవారం పరామర్శించారు. కొండపాక కు చెందిన మంగలి నరసయ్య, వడ్ల సులోచనలు అనారోగ్యంతో మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి సంతాపం తెలిపాడు. వారి కుటుంబ సభ్యులకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

- **దౌల్తాబాద్:** మృతుడి కుటుంబానికి ఆగాపే ట్రస్టు అండగా నిలిచింది. మండలంలోని దొమ్మాట గ్రామానికి చెందిన మంగలి దశరథం అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆగాపే ట్రస్ట్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు నర్ర రాజేందర్, నర్రా నవీన్ కుమార్, రాగి ప్రభు ముత్యంపేట నరేష్, శ్రీనివాస్, కొమ్ము రాజు, చల్లస్వామి మృతుడి కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయమందించారు.

రాములు యాదిలో..

(5వ పేజీ తరువాయి)

తల్లిదండ్రుల వద్దకు వచ్చి లొంగిపోవాలని చెప్పినా తిరిగి రాలేదు.

కుటుంబ వివరాలు..

రామచంద్రారెడ్డి భార్య సాహితి (శాంతిప్రియ) కూడా ఆయనతో పాటు అజ్ఞాత జీవితం గడిపారు. పదేళ్ల క్రితం ఆమె స్వచ్ఛందంగా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. కుమారుడు రాజాచంద్ర ఉస్మానియా యూనివర్సిటీలో న్యాయశాస్త్రం చదువుతున్నారు. కూతురు స్నేహచంద్రకు వివాహం జరిగింది.

- చిన్ననాటి స్నేహితుల జ్ఞాపకాలు వారి మాటల్లో..

కోహెడలో కలిసి చదువుకున్నాం



కోహెడ హైస్కూల్‌లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు నేను, రామచంద్రారెడ్డి కలిసి చదువుకున్నాం. 1983లో ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందాడు. నేను కూడా ఏడాది తర్వాత ప్రభుత్వ టీచర్‌గా ఎంపికై వరుకోలులో ఆయనతో కలిసి పని చేశాను. ఉపాధ్యాయ సమస్యలపై అప్పుడే ఉద్యమాలు చేశారు. 1989లో అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత ఒకసారి కలిశాడు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో న్యాయవాదిగా పనిచేస్తున్నానని చెప్పాడు.

- పి. రవీందర్‌రావు, కిమ్స్ సంస్థల చైర్మన్

లెక్కల్లో ఎప్పుడూ ఫస్టే



"మేము రామచంద్రారెడ్డిని ముద్దుగా "రాములు" అని పిలుచుకునేవాళ్లం. రాములు లెక్కల్లో ఎప్పుడూ ఫస్ట్ ప్లేస్‌లో ఉండేవాడు. ఉద్యోగం వచ్చాక అజ్ఞాతంలోకి వెళ్లాడని తెలిసి బాధపడ్డాం. ప్రజల కోసం అప్పుడే పోరుబాట పట్టారు. పేదల కోసం జీవించిన మా రాములు ఎన్‌కౌంటర్ అయ్యాడని తెలువగానే నాటి రోజులు కళ్ల ముందు మెదులుతున్నాయి.

దొమ్మాట జగన్‌రెడ్డి, కోహెడ మాజీ సర్పంచ్,

ప్రజా సమస్యలపైనే ఆలోచించేవాడు



రామచంద్రారెడ్డి నా చిన్ననాటి స్నేహితుడు. మొదటి నుంచి అభ్యుదయ భావాలు ఉన్న వ్యక్తి. ప్రజల సమస్యల గురించే ఎక్కువగా ఆలోచించేవాడు. అదే ఆయనను నక్సల్స్ ఉద్యమంలో చేరేలా చేసింది. అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత ఒక్కనాడూ ఇటువైపు రాలేదు.

- పేర్యాల సుధాకర్‌రావు, కోహెడ

మాధవరెడ్డి మృతి తీరనిలోటు

మిరుదొడ్డి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి మాజీ సర్పంచు పన్యాల మాధవరెడ్డి మృతి తీరనిలోటని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మృతిచెందిన మాధవరెడ్డి భౌతికకాయానికి మంగళవారం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి పూలమాలను వేసి నివాళులర్పించారు. వెంట బీఆర్ఎస్ నాయకులు బాలమల్లేశం గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జడిపల్లి రవి తదితరులున్నారు.

ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను నాణ్యతతో చేపట్టాలి

హుస్నాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనుల్లో నాణ్యత లేనట్లయితే ఆందోళనలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. రూ. 18 కోట్లతో చేపట్టిన ఈ సుందరీకరణ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసి 9 నెలలు గడిచినా ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. బతుకమ్మ ఏర్పాట్ల హడావిడిలో పనుల నాణ్యత దెబ్బతినే అవకాశముందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల వికాస్, ప్రశాంత్ ఉన్నారు.

క్యాంపు కార్యాలయం దుర్వినియోగంపై ఫిర్యాదు

గజ్వేల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం దుర్వినియోగంపై బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్ మాట్లాడుతూ... కొందరు వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారి వ్యక్తిగత మీడియా సమావేశాల కోసం క్యాంపు కార్యాలయాన్ని వాడుకోవడం శోచనీయమన్నారు. ఎటువంటి బాధ్యతలు లేకున్నా క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాలు నిర్వహించడం చట్ట వ్యతిరేకమన్నారు. ప్రైవేటు వ్యక్తులు క్యాంపు కార్యాలయాన్ని వాడుకోవడంపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసినవారిలో బీజేపీ నాయకులు కుడిక్యాల రాములు, నత్తి శివకుమార్, చెప్యాల వెంకట్‌రెడ్డి, నాయిని సందీప్, నరసింహ, చిక్కుడు ప్రసాద్, పంజాల శివకుమార్, నాగులు తదితరులున్నారు.

అద్దె బస్సు డ్రైవర్ల చర్చలు సఫలం

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీతాలు పెంచాలనే డిమాండ్‌తో చేపట్టిన ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె మంగళవారం రెండో రోజు కూడా కొనసాగింది. అయితే మేనేజర్ రఘు ఆధ్వర్యంలో డ్రైవర్లు అద్దె బస్సు ఓనర్లు చర్చలు జరపగా ఫలవంతమయ్యాయి. ప్రస్తుతం ఇస్తున్న వేతనంతో పాటు మరో రూ. 2వేలు, రెండు జతల యూనిఫామ్ అందిస్తామని అగ్రిమెంట్ కావడంతో సమ్మె విరమించినట్లు తెలిపారు. ఈ అగ్రిమెంట్ రెండేళ్ల పాటు కొనసాగుతుందని అద్దె బస్సు డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు తెలిపారు. సమ్మెలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, జిల్లా నాయకులు రవికుమార్, యూనియన్ కార్యదర్శి దబ్బెట పరమేష్, ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డితో పాటు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



సిద్దిపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరంలాంటిదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేటలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.30 లక్షల విలువ గల చెక్కులను పూజల హరికృష్ణ, అత్తుఇమామ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముద్దం లక్ష్మి, కలిమొద్దీన్, ఆలకుంట మహేందర్, తప్పెట శంకర్, రాములు, వహీద్‌ఖాన్, వహాబ్, అర్షద్, బాబు, రజిని, సన, అజ్మత్, సాయి ప్రతాప్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట మండల అభివృద్ధికి ఎంపీ నిధులు

అక్కన్నపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండల అభివృద్ధికి ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ రూ. 35.25 కోట్లు మంజూరు చేసినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. మండలంలోని రామవరం నుంచి హుస్నాబాద్ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.22 కోట్లు, అంతకపేట నుంచి కొత్తకొండ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.12 కోట్లు సీఐఆర్ఎఫ్ నిధుల నుంచి మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి కోసం రూ.48 లక్షలతో 24బోర్లు మంజూరు చేశారన్నారు. అంతకపేట, జనగామ, రామవరం, మోత్కులపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో సీసీ రోడ్ల కోసం మొత్తం రూ.50 లక్షలు కేటాయించినట్టు వివరించారు. పలు గ్రామాల్లో రూ.8 లక్షలతో హైమాస్ట్ లైట్లు, రూ.9 లక్షలతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. కన్నారంలో పలు సంఘాలకు కమ్యూనిటీ భవనాల నిర్మాణాలకు, మైసమ్మ వాగు తండాలో రూ.1.5 లక్షలతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 148 మంది పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారని, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఎంపీ కోటా కింద 100 ఇళ్ల మంజూరుకు, ఏకలవ్య గురుకుల విద్యాలయం కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారని తెలిపారు. నిధులు మంజూరు చేసిన మంత్రి బండి సంజయ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

కూల్చిన దర్గా, కబ్రస్తాన్‌ను వెంటనే నిర్మించాలి



సిద్దిపేటలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ మైనారిటీ విభాగం నాయకులు

సిద్దిపేట సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు వెడల్పు పేరిట ఇటీవల కొడంగల్‌లో కబ్రస్తాన్, దర్గా కూల్చడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం బీఆర్ఎస్ సిద్దిపేట మైనారిటీ విభాగం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు సిద్దిపేట పట్టణంలోని ఇక్బాల్ మినార్ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ మైనారిటీ విభాగం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎక్కడైతే కూల్చారో అదే స్థలంలో దర్గా, కబ్రస్తాన్‌ను నిర్మించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మైనారిటీలకు హామీల పేరిట ప్రతిసారీ కాంగ్రెస్ మోసం చేసిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, కనీసం ఒక్క మైనార్టీ నాయకుడికి మంత్రి పదవి ఇవ్వకపోవడం పట్ల మైనార్టీల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధి బయటపడిందని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

సమాజసేవలో ఎన్ఎస్ఎస్ ముందంజ

దౌల్తాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలను సమాజ సేవ పట్ల చైతన్యం పరచడంలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ముందుంటుందని దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీవాత్సవ పేర్కొన్నారు. మంగళవారం దొమ్మాట, గాజులపల్లిలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మంగ్త నాయక్, సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరం ప్రారంభోత్సవానికి కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీవాత్సవ హాజరై మాట్లాడారు. గాజులపల్లి దొమ్మాట గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ద్వారా వలంటీర్లు నిత్యం ఏదో ఒక రూపంలో ప్రజలకు సేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన

మద్దూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా లభించే చిరుధాన్యాలలో సంపూర్ణ పోషకాలు లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పుష్పలత సూచించారు. మంగళవారం మండలంలోని గాగిల్లాపూర్‌లో పోషణమాసోత్సవాల్లో భాగంగా గాగిల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి సహజంగా లభించే ఆకుకూరలు, పప్పుదినుసులను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

జగదేవపూర్: సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగదేవపూర్, వైద్య అధికారి డాక్టర్ సత్య ప్రకాష్ అన్నారు. సోమవారం జగదేవపూర్ మండల కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పలు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్య ప్రకాష్ మాట్లాడుతూ వర్షాలు పడుతుండడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ జితేందర్ తదితరులు ఉన్నారు.